VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 18

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 16 జూన్ 2026

# డిజిటల్ గవర్నెన్స్‌లోనూ గూగుల్ భాగస్వామ్యం

- వివిధ రంగాల్లో గూగుల్‌తో కలిసి పని చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్
- ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు... సప్లై చైన్ సిటీ నిర్మాణానికి విస్తృత అవకాశాలు
- యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆహ్వానం
- సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు








**సింగపూర్,కలంకౌంటర్ :** వివిధ రంగాల్లో సంయుక్తంగా పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ నిర్ణయించాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ మేరకు జరిగిన చర్చల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి ఇరువురు వచ్చారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామి కావాలని కరణ్ బజ్వాను ముఖ్యమంత్రి కోరారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గూగుల్ ఆసియా - పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో వివిధ కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. మరోవైపు ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. ఆధునిక క్లౌడ్ సాంకేతికతలను వినియోగించుకుని రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలనేది తమ సీఎం వివరించారు. అలాగే ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల



ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని... దీనికి గూగుల్ నుంచి సహకారం కావాలన్నారు. ఇదే కాకుండా వైద్యసేవలు అందించే విషయంలో సాంకేతికను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ సంజీవని ప్రాజెక్టు అమలు చేస్తున్నట్ట ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులో గూగుల్ సంస్థ భాగస్వామి కావాలని కోరారు. ఇక డేటా సెంటర్లకు, వివిధ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కోసం తాము గ్రీన్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు సీఎం వివరించారు. ఈ మేరకు గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను గూగుల్ ప్రతినిధి కరణ్ బజ్వాకు చంద్రబాబు చెప్పారు.

**లాజిస్టిక్స్ రంగంలో అపార అవకాశాలు..** సింగపూర్ వేదికగా సీఎం చంద్రబాబు జరిపిన వరుస సమావేశాల్లో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై వైసీహెచ్ గ్రూప్‌తో సీఎం చర్చించారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఏపీలో 1,053 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని... లాజిస్టిక్స్ పరంగా పెట్టుబడులు పెట్టేందుకు అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం వివరించారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని... లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పని చేస్తున్నామంటూ ఏపీలోని లాజిస్టిక్స్ వసతులు.. ఉన్న వనరులను వైసీహెచ్ గ్రూప్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు రాష్ట్రంలో ఉద్యానరంగంలో రూ.1 లక్ష కోట్లు

- 2లో

# గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల నుంచి ఎక్సైజ్ రంగాన్ని గాడిలో పెట్టాం

- రెండేళ్లలో ఎక్సైజ్ రంగంలో చారిత్రాత్మక మార్పులు సాధించాం-రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఎక్సైజ్ రంగాన్ని గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, విధానపరమైన వైఫల్యాలు, పారదర్శకత లేమి తీవ్రంగా దెబ్బతీశాయని రాష్ట్ర ఎక్సైజ్, గనులు ఒ భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రజల అభిరుచులు, మార్కెట్ అవసరాలు, ప్రభుత్వ ఆదాయ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి అమలు చేసిన విధానాల వల్ల రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థ విశ్వసనీయత కోల్పోయిందని ఆయన అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్సైజ్ రంగ పునరుద్ధరణను అత్యంత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏర్పడిన అవ్యవస్థను సరిదిద్దడంతో పాటు, పారదర్శకత, సాంకేతికత, వినియోగదారుల స్వేచ్ఛ, నాణ్యత నియంత్రణ, ఆదాయ వృద్ధి అనే ఐదు అంశాలపై ఆధారపడి కొత్త ఎక్సైజ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

**ప్రజల ఆరోగ్యం -- ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం...** ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారదర్శక పాలన, అక్రమాల నిర్మూలన, ప్రభుత్వ ఆదాయ వృద్ధి అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థను దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. .

**గత ప్రభుత్వ విధానాలు -- ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం...** గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో మద్యం విక్రయ వ్యవస్థను పూర్తిగా కేంద్రీకరించి, మార్కెట్ డిమాండ్‌ను పక్కనబెట్టి కొద్ది బ్రాండ్లకు మాత్రమే ప్రాధాన్యత కల్పించారని మంత్రి విమర్శించారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడయ్యే ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను రాష్ట్రంలో అందుబాటులో లేకుండా చేయడం ద్వారా వినియోగదారుల ఎంపిక హక్కును కాలరాసారని అన్నారు. ప్రజలకు కావలసిన బ్రాండ్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో అక్రమ సరఫరా వ్యవస్థలు పెరిగాయని, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాలు ప్రజల అవసరాల కోసం కాకుండా కొందరి ప్రయోజనాల కోసం పనిచేశాయనే అభిప్రాయం అప్పట్లో విస్తృతంగా వ్యక్తమైందన్నారు.

**ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి అవకతవకలకు అవకాశం...** మద్యం సరఫరా, పంపిణీలో పారదర్శకతను తీసుకువచ్చే ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, మాన్యువల్ విధానాలకు ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి తెలిపారు. షాపులు కోరిన బ్రాండ్లకు బదులుగా అధికార యంత్రాంగం నిర్ణయించిన బ్రాండ్లను బలవంతంగా సరఫరా చేయడం వల్ల మార్కెట్ సహజ వ్యవస్థ దెబ్బతిందన్నారు.

**నగదు లావాదేవీలతో పారదర్శకతకు భంగం...** గత ప్రభుత్వ కాలంలో డిజిటల్ చెల్లింపులను నిరుత్సాహపరిచి, నగదు లావాదేవీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పారదర్శకత పూర్తిగా దెబ్బతిందని మంత్రి తెలిపారు. దాదాపు రూ.99,413 కోట్ల రిటైల్ మద్యం విక్రయాల్లో కేవలం రూ.615 కోట్ల మేర మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరగడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు. డిజిటల్ వ్యవస్థలను పక్కనబెట్టడం వల్ల ఆదాయ లీకేజీలు, అక్రమ ఆర్థిక ప్రవాహాలు, లెక్కల్లో అస్పష్టత వంటి అనేక సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు.

**నూతన ఎక్సైజ్ విధానం -- సంస్కరణల యుగారంభం...** ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎక్సైజ్ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. పారదర్శకత, పోటీ, వినియోగదారుల స్వేచ్ఛ, ప్రభుత్వ ఆదాయ వృద్ధి లక్ష్యాల ఆధారంగా నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపొందించామని చెప్పారు. ప్రైవేట్ రిటైల్ వ్యవస్థను పునరుద్ధరించి, పూర్తిగా పారదర్శకమైన దరఖాస్తు మరియు లాటరీ విధానాల ద్వారా షాపుల కేటాయింపులు చేపట్టామని తెలిపారు. గతంలో ఉన్న అనధికార చెల్లింపులు, మధ్యవర్తిత్వ వ్యవస్థలకు పూర్తిగా ముగింపు పలికామని స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో స్పందించిన దరఖాస్తుదారులు...** నూతన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు.

**వినియోగదారుడే కేంద్రబిందువు...** నూతన ఎక్సైజ్ విధానంలో వినియోగదారుల అభిరుచులు, మార్కెట్ డిమాండ్‌కు అత్యంత ప్రాధాన్యత కల్పించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అందుబాటులో లేకుండా పోయిన అనేక జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను తిరిగి రాష్ట్ర మార్కెట్‌లోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో లభ్యమవుతున్న ప్రముఖ బ్రాండ్లతో పాటు పలు ప్రీమియం, సూపర్ ప్రీమియం ఉత్పత్తులు కూడా ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీర్ విభాగంలోనే 46కు పైగా బ్రాండ్లు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయని, గతంలో రాష్ట్ర మార్కెట్‌లో లేని అనేక అంతర్జాతీయ బ్రాండ్లు కూడా ప్రవేశించాయని చెప్పారు. వినియోగదారులకు విస్తృత ఎంపిక అవకాశాలు కల్పించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తమ అభిరుచికి అనుగుణంగా ఎంచుకునే స్వేచ్ఛను ప్రభుత్వం పునరుద్ధరించిందని మంత్రి పేర్కొన్నారు.

**నాణ్యతపై రాజీపడని ప్రభుత్వం...** మద్యం నాణ్యత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన ప్రమాణాలను అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విక్రయించే ప్రతి మద్యం ఉత్పత్తిని శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా సమగ్రంగా పరీక్షించిన అనంతరమే మార్కెట్‌లోకి అనుమతిస్తున్నామని తెలిపారు. ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ దశ నుంచి తుది ఉత్పత్తి వరకు ప్రతి దశలో నాణ్యత తనిఖీలు నిర్వహిస్తూ, ఉత్పత్తి ప్రక్రియలో వివిధ దశల్లో నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నామని వివరించారు. ప్రతి బ్రాండ్‌పై 13కు పైగా కీలక నాణ్యత ప్రమాణాల ఆధారంగా పరిశీలనలు చేపడుతూ, అత్యాధునిక ప్రయోగశాలల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైతే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రయోగశాలల సహకారాన్ని కూడా తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**కల్తీ మద్యం నిర్మూలనకు ప్రత్యేక చర్యలు...** కల్తీ మద్యం, నకిలీ బ్రాండ్లు, అక్రమ రవాణా, పన్ను ఎగవేత వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చాముకూరి శ్రీధర్, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

# జెన్ జీ తరాన్ని గందరగోళపరచే శక్తులున్నాయి

- ఫ్యాషన్ పేర్ల పట్ల ... ఫాన్సీ సిద్ధాంతాల పట్ల జాగ్రత్త అవసరం
- చదవండి.. తెలుసుకోండి.. పరిశీలించండి.. నిర్ణయం తీసుకోండి
- దేశ క్షేమం, శ్రేయస్సు, భద్రత, భవిష్యత్తు ప్రధానం
- కాంగ్రెస్ హిపోక్రసీ రాజకీయాలు మానుకోవాలి
- తెలంగాణలో జనసేన నిస్వార్థంగా పోరాడుతుంది
- నరేంద్ర మోదీ బలమైన దేశభక్తి గల నాయకుడు
- ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' సమావేశం ముగింపు సందర్భంగా ప్రసంగించిన జనసేన అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**న్యూఢిల్లీ,కలంకౌంటర్ ::** 'ప్రతి తరంలోనూ సమాజంలో జరిగే కొన్ని విషయాల పట్ల కోపం, కసి, వేదన, బాధ ఉంటాయి. సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి అవి యువతరంలో వివిధ దశల్లో ఉండటం సహజం. యౌవన దశలో కచ్చితంగా అతివాద భావాలుండటం సాధారణం. ఆ భావాలకు దేశభక్తిని జోడించి పరిష్కారం చేపట్టాలి. నా దేశం, నా నేల అనే భావన ప్రతి ఒక్కరిలో కచ్చితంగా ఉండాలి. నేటి తరం ఏ విషయాన్ని అయినా చదవండి... తెలుసుకోండి... పరిశోధించండి.. పరిశీలించండి.. ఆ తర్వాతే దానిపై స్థిరమైన భావాన్ని ఏర్పరచుకోండి. అప్పుడే మనకు దేశానికి మేలు చేసే సానుకూల ఆలోచనలు పుడతాయి. కేవలం ఫ్యాషన్ గా ఉండే పేర్లకు, మెదడును గందరగోళపరిచే అంశాలకు జెన్ జీ దూరంగా ఉండటం మేలు' అని జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేటి జన్ జీ తరం అయినా, ఏ తరం అయినా దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమాధికారం, సచ్ఛీలతను కాపాడేలా ఆలోచించాలని చెప్పారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ సమైక్యత కోసం.. 'సేన ప్రస్థానం' సమావేశం ముగింపు సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "దేశానికి వాణిజ్య రాజధాని అయిన ముంబయిలో 72 గంటలపాటు ఉగ్రవాదులు చేసిన మారణహోమం భారతీయులందరికీ గుర్తే. దీనిపై నేను చాలా కలత చెందాను. మా నాన్న గారి అస్థికలను వారణాసిలోని



గంగనదిలో కలిపేందుకు వెళ్తూ.. కాశీ విశ్వేశ్వరుడ్ని బలంగా వేడుకున్నాను. దేశానికి ఉగ్రవాదం పీడ తప్పించే బలమైన నాయకత్వం ఇవ్వమని కోరాను. దేశాన్ని ముందుకు నడిపించే, ఐక్యంగా ఉంచే నిస్వార్థ నాయకుడే నరేంద్ర దామోదర్ దాస్ మోడీ భారతదేశానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ ఓ బలమైన నాయకుడ్ని తయారు చేసుకుంటుంది. అది ఈ దేశానికి ఉన్న సత్తా. మోదీ దేశం గురించి అంత గొప్పగా ఆలోచిస్తారు కాబట్టే, నేను ఆయనకు అంత బలంగా మద్దతు పలుకుతాను.


దేశ గతిని మలుపు తిప్పుతూ, ప్రపంచంలోనే దేశాన్ని అత్యున్నత శిఖరం మీద నిలిపిన గొప్ప

- 3లో

# రొయ్యల ఫీడ్ ధరల పర్యవేక్షణకు శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు

- ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కీలక నిర్ణయం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలను శాస్త్రీయంగా అంచనా వేయడం, పర్యవేక్షించడం, పారదర్శకమైన ఫీడ్ ధరల నిర్ణయానికి శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ శ్రింప్ ఫీడ్ ఇన్‌గ్రిడియెంట్స్ ప్రైస్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఆక్వా రంగంలో ఫీడ్ ధరల నియంత్రణ, పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ కమిటీలో మెరైన్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (MPEDA), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్ (CIBA), ఫిషరీస్ యూనివర్సిటీ, ఆక్వా ఫీడ్ తయారీదారుల ప్రతినిధులు, ఆక్వా రైతుల సంఘాల ప్రతినిధులు, ఏపీఎస్ఏడీఏ సభ్యులు, ఫీడ్ డీలర్ల సంఘాల ప్రతినిధులు, ఫిషరీస్ శాఖ సాంకేతిక నిపుణులు, ఆర్టీజీఎస్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా ముగ్గురు ఆక్వా రైతుల ప్రతినిధులు, ఇద్దరు ఏపీఎస్ఏడీఏ



డైరెక్టర్లను మత్స్యశాఖ కమిషనర్ నామినేట్ చేయనున్నారని చెప్పారు. ప్రభుత్వ విధానపరమైన మార్గదర్శకత్వం, సమన్వయం మరింత సమర్థవంతంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కో-వైస్ చైర్మన్‌ను సభ్యునిగా చేర్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక విద్యా సంస్థ (SIFT) ప్రిన్సిపాల్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు. రొయ్యల ఫీడ్ ధరలను ప్రభావితం చేసే ముడి పదార్థాల వ్యయం, తయారీ ఖర్చులు, రవాణా వ్యయాలు, మార్కెట్ పరిస్థితులు, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలను కమిటీ నిరంతరం సమీక్షిస్తుందని మంత్రి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ఫీడ్ పదార్థాల ధరలు, దిగుమతి, ఎగుమతి పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు, డీలర్లు, ఇతర భాగస్వాముల అభిప్రాయాలను సేకరించి, సాంకేతిక నిపుణులు, పరిశోధనా సంస్థల సహకారంతో పారదర్శకమైన ధరల నిర్ణయ విధానాలను రూపొందించడం ద్వారా ఆక్వా రైతులకు మేలు చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పట్ల అపోహలు తగదు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** జాతీయస్థాయిలో నిర్వహించబడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియ పట్ల ఎటువంటి అపోహలు తగదని ప్రభుత్వ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు పూర్తి సరి అయిన సమాచారాన్ని అందించాలని ఉయ్యూరు రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం కరుణకుమారి కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు ఈ ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారని చెప్పారు. డి ఎల్ వోలు ప్రత్యేక దరఖాస్తుల ద్వారా ఇంటికి వచ్చినప్పుడు పూర్తి సమగ్ర సమాచారాన్ని అందించాలని 2002 లో జరిగిన ఓట్ల జాబితాలోని తమ పేర్లను సరిచూసుకోవాలని కొత్త ఫోటోలు జతపరచాలని సూచించారు. చనిపోయిన వివాహం చేసుకొని వెళ్లిపోయిన వివాహం చేసుకొని వచ్చిన కుటుంబంలో చేరిన కొత్త వ్యక్తులు పిల్లలు వారి పూర్తి సమాచారాన్ని బిఎల్వోలుకు అందించాలని వీటి ద్వారా తప్పులు లేని ఓటర్ల జాబితాను మనం రూపొందించవచ్చని ఆమె చెప్పారు. ఈ విషయంలో ప్రజలకు ఉన్న ప్రతి అపోహను బిఎల్వోలు తొలగిస్తారని, అందుబాటులో లేని ఓటర్ల కోసం మూడు పర్యాయాలు ఆ గృహాన్ని సందర్శిస్తారని జాబితా రూపొందించిన తర్వాత ప్రతి గ్రామ సచివాలయాలలోను ప్రదర్శిస్తారని తెలిపారు. కొత్తగా ఓటర్లుగా చేరే వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిఎల్ఓ పేరుతో వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి బిఎల్ఓ కు గుర్తింపు కార్డు ఉంటుందని దాన్ని పరిశీలించిన తర్వాతే వివరాలు తెలపాలని ఆమె కోరారు.

# స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి

–కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.





**తిరుపతి,కలంకౌంటర్ :** స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆర్యవైశ్యులకు ఎక్కువ సీట్లు కేటాయించండి

–జూలకంటి శ్రీనివాసరావు



**తాడేపల్లి,కలంకౌంటర్ :** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు , ఎంపీ , ఎం ఎల్ ఎ జనరల్ ఎలక్షన్స్ లోను ఆర్యవైశ్యులకు ఎక్కువ టికెట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో, దేవస్థానాల ట్రస్ట్ బోర్డు లోను ఆర్యవైశ్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి రాష్ట్ర ఆర్యవైశ్యల తరఫున ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు వినతి పత్రం సమర్పించారు.

# భారత్ దూసుకెళ్తున్న ఆర్థిక శక్తి - ఏపీ కీలక చోదకశక్తి

● ఆర్టీఐహెచ్‌లో ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు ● ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి ఏపీ అనుకూలం ● సింగపూర్ పర్యటనలో వెంచర్ క్యాపిటలిస్టులతో సీఎం చంద్రబాబు సమావేశం ● భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతోనూ ముఖ్యమంత్రి భేటీ





**సింగపూర్,కలంకౌంటర్ :** సంస్కరణలతో భారత్ దూసుకుపోతున్న ఆర్థిక శక్తిగా మారిందని, ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక చోదక శక్తిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక వృద్ధికి దశాబ్దాల కాలం పట్టిందని.. భారత్‌కు అంత సమయం అవసరం లేదని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆధునిక ఆలోచనలు, సంస్కరణలతో భారత్‌ను అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలిరోజు సోమవారం వెంచర్ క్యాపిటలిస్టులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్ ఇప్పుడు అగ్రస్థానంలో ఉందన్నారు. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని అన్నారు. డెమొగ్రాఫిక్ డివిడెండ్‌తో అతిపెద్ద యువశక్తి ఉన్న మానవ వనరుల దేశంగా భారత్ నిలిచిందన్నారు. భారత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5వ జనరేషన్ ఫైటర్ జెట్‌లు సహా వివిధ రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని సీఎం వివరించారు. మెడికల్ టెక్నాలజీ, ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని సీఎం తెలియచేశారు. ఏపీకి అడ్వాన్స్ డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఆమ్కా), గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు, భూములు కేటాయించామని ముఖ్యమంత్రి వారికి వివరించారు. ఏపీలో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం అని.. పెట్టుబడిదారులు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామికవాడలు పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. ఏపీలో పౌరసేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందన్నారు. వెంచర్ క్యాపిటలిస్టులు ఆర్టీఐహెచ్ ప్రోత్సహించిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని పోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని సీఎం అన్నారు. ఈ సమావేశానికి ఆరిజన్ వెంచర్స్, ఆటోమెనిక్స్, ఏలెవ్ 8 వెంచర్స్, ఆప్టిమమ్ సొల్యూషన్స్, క్వోనా కాపిటల్, జంగిల్ వెంచర్స్ తదితర వెంచర్ క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

**షిప్ బిల్డింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలం..** తొలిరోజు పర్యటనలో ముందుగా... సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. భారత్‌లో సింగపూర్‌కు ఉన్న ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని సీఎం స్పష్టం చేశారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సీఎం కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఏపీలో కొత్తగా అందుబాటులోకి పోర్టులు అందుబాటులోకి వస్తున్నందున షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్, మెయింటెనెన్స్, రిపేర్స్ ఓవర్ హాలింగ్ కేంద్రాలకు నెలకొల్పేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఏపీలో హార్టికల్చర్ ఉత్పత్తుల ట్రేసింగ్, సర్టిఫికేషన్‌కు వెళ్తున్నామని సీఎం వివరించారు. రోబోటిక్స్, మెడికల్ డివైజెస్, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సింగపూర్ సహకారం కోరుతున్నామని అన్నారు. సింగపూర్-ఏపీ విద్య సంస్థల మధ్య భాగస్వామ్యం ఏర్పాటుకు కృషి చేయాలని సీఎం కోరారు. ఈ సమావేశానికి మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# ఎన్నికల్లో ఇచ్చి ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసింది

● రెండేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచలేదు, మూడేళ్లలో పెంచేది లేదు ●పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం ●రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి ● పెట్టుబడిదారులను తరిమేసిన చరిత్ర జగన్ రెడ్డిది ● -ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**నరసరావుపేట,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతూ, దుష్ప్రచారాలు చేయడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పార్టీ నీచ రాజకీయాలు చేస్తుందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నరసరావుపేటలో సోమవారం నిర్వహించిన కూటమి రెండేళ్ల విజయోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. అలాగే డీఆర్డీఏ, వెలుగు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సబ్సిడీపై ఆటోలను అందజేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించిన మంత్రి గొట్టిపాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ., ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి కూటమి కార్యకర్తలే ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది అయితే., విద్యుత్ పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి తరిమేసిన నీచ చరిత్ర జగన్ ప్రభుత్వానిదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసమే ఏడాదికి రూ.33 వేల కోట్లను వెచ్చిస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున పింఛన్ల కోసం ఖర్చు చేయడం లేదని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కరోజే రూ.10 వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.8,900 కోట్లకు పైగా సహాయం చేశామన్నారు. విద్యార్థులు అందరికీ ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి, కేవలం ఒక్క బిడ్డకే అమ్మ ఒడి అమలు చేసినట్లు మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ఇలా ఇచ్చిన ప్రతీ హామీని వైసీపీ ప్రభుత్వం తప్పిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్నఅవినీతి ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. వైసీపీ పాలనలో అమరావతి రాజధాని పనులు నిలిచిపోయాయని, 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు కూడా నిలిచిపోవడంతో రైతులకు సాగునీరు అందలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిలిచిపోవడం వల్ల 920 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం కూడా ఆగిపోయిందని తెలిపారు. వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, కోట్లాది రూపాయిలు అప్పులు తెచ్చి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారని మంత్రి ఆరోపించారు. రెండేళ్ల కూటమి పాలనలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విద్యుత్ భారం ప్రజలపై వేయలేదని, రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీల పెంపు ఉండదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. రాయలసీమతో పాటు పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, పల్నాడులో రెండు సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలకు ఏవి అవసరమో అవన్నీ చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్లతో పాటు అర్హులకు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు.

# డిజిటల్ గవర్నెన్స్‌లోనూ గూగుల్ భాగస్వామ్యం

●వివిధ రంగాల్లో గూగుల్‌తో కలిసి పని చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ● ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు... సప్లై చైన్ సిటీ నిర్మాణానికి విస్తృత అవకాశాలు ● యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆహ్వానం ● సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు

(మొదటిపేజీ తరువాయి)



పెట్టుబడులు వస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. ఆక్వాకల్చర్‌లో ఏపీ నెంబర్ 1 స్థానంలో ఉందని... ఆహార ఉత్పత్తులకు మరింత విలువ జోడించడం ద్వారా ఎగుమతులు పెరిగాయని వివరించారు. ఏపీని సందర్శించాలని... రాష్ట్రం అమలు చేస్తున్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టాలని వైసీహెచ్ గ్రూప్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని, దీనికి భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. యూఎన్ హాబిటాట్‌తో సంపూర్ణ భాగస్వామ్యం కోరుకుంటున్నామని అనాక్లాడియాకు సీఎం తెలిపారు. దీనిపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యం, ప్రణాళిక దశలో ఎస్డీజీలను చేర్చడం, ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్ సహకారం పైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి యూఎన్ హాబిటాట్ సహకారాన్ని సీఎం కోరారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం(ఫాఖా) అమలుపై చర్చించారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్యస్థాయి నగరాల్లో అర్బన్ రాస్తా ఫ్రేమ్ వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయాలని సీఎం ప్రతిపాదించారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం -- స్థానిక ఆదాయ వనరులను పెంచేందుకు వాల్యూ కాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టడం - అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ తదితర అంశాలపైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఈ సమావేశాల్లో మంత్రి నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర కార్యక్రమం జయప్రదం చేయాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిసున్న యోగాంధ్ర కార్యాక్రమంలో ఆందరు పాల్గొని జయప్రదం చేయాలని ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ అధికారి ఎం కరుణకుమారి కోరారు. కూచిపూడి కళాక్షేత్రంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి రెవెన్యూ డివిజన్ నుంచి ప్రజలు హాజరయ్యేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

# ప్రత్యేక 'పోలీస్ మీకోసం' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు







**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కారించాలని , ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు సోమవారం డిఎస్పీ కార్యాలయ ఆవరణలోని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూర, ఇతర ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, వారి సమస్యల పూర్తి వివరాలను తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు పోలీస్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో ప్రత్యేక పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి ఒంగోలులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రతి సోమవారం ఆల్టర్నేట్ గా ప్రకాశం, మార్కాపురం జిల్లాలో ఒక్కొక్క సబ్ డివిజన్ లో కూడా ప్రత్యేక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వాటిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పీ బాలసుబ్రహ్మణ్యం , ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, కందుకూరు సీఐ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ఒంగోలు రూరల్ శేషగిరి రావు, దర్శి సీఐ రామారావు, కొండేపి సీఐ రమణయ్య, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎం ఎల్ ఎ కావ్య కృష్ణారెడ్డి.

-కావలి,కలంకౌంటర్ :



ఏపీ మంత్రి నారా లోకేశ్ బ్రాహ్మణి దంపతులు తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా తెలిపారు. కుటుంబ ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ మహాశివుడికి రుద్రాభిషేకం చేసినట్లు పేర్కొన్నారు. సేవ చేసేందుకు అవసరమైన శక్తిని ప్రసాదించాలని పరమశివుడిని కోరుకున్నట్లు లోకేశ్ తెలిపారు.

-విజయవాడ, కలంకౌంటర్ :

# 55 లక్షలకు చేరిన 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

- ఏర్పాట్ల వారీగా జిల్లాలకు ర్యాంకులు
- కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం కృషి

**అమరావతి,కలంకౌంటర్ :** ' యోగాంధ్ర–2026 'కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం వరకు 55 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 24 లక్షల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5,34,217, అనంతపురం జిల్లా–4,98,758, నెల్లూరు జిల్లా–4,94,757, కడప జిల్లాల్లో 4,79,510 చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా జిల్లాల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరగనుంది. వైద్య విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో యోగాసనాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లపై సోమవారం వర్చువల్ గా జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులు వివరించారు.

**జిల్లాల వారీగా ఏర్పాట్ల తీరు మదింపు..** రాష్ట్ర వ్యాప్తంగా 1,27,562 యోగాసన కార్యక్రమాల వేదికలను గ్రామ/ వార్డు స్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటివరకు 72,688 వేదికలు సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు అత్యధికంగా ఏలూరు జిల్లాలో 9,575, పశ్చిమగోదావరి జిల్లా–4,702, విజయనగరం–4,653, నెల్లూరు జిల్లాలో 4,253 చొప్పున వేదికలను సిద్ధంచేశారు. ఈ వేదికల సంఖ్య ఇంకా భారీఎత్తున పెరగనుంది. యోగా ట్రైనర్ల సంఖ్య 1,62,369 వరకు నమోదైంది. ట్రైనర్లకు తగ్గట్లు రిజిస్ట్రేషన్ల ద్వారా ఆసక్తి కనబరచిన పౌరులకు యోగాసనాలపై శిక్షణ కార్యక్రమాలు జరిగేవిధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో పురోగతిని కనబరిచే జిల్లాలకు ర్యాంకులు కూడా ప్రకటిస్తున్నారు. పౌరుల రిజిస్ట్రేషన్లు, యోగా ట్రైనర్లకు శిక్షణ, మ్యాపింగ్, వేదికల గుర్తింపు, పోటీల నిర్వహణ కేటగిరీల్లో కలిపి జిల్లాల వారీగా పురోగతిని గమనించినప్పుడు గుంటూరు, ఏలూరు జిల్లాల పేర్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. పౌరుల రిజిస్ట్రేషన్లలో పశ్చిమ గోదావరి , ఏలూరు జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే విషయమై ప్రతిరోజూ ఉన్నత స్థాయిలో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ లు జరుగుతున్నాయి. మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో సోమవారం జరిగిన యోగాసనాల కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చురుగ్గా పాల్గొన్నారు.

**వేదిక మార్పు..** తొలుత నిర్ణయించిన ప్రకారం కృష్ణానది (బ్రిడ్జి (వెస్ట్ బైపాస్ రోడ్డు) పైన కాకుండా. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు వాతావరణం శాఖ జారీచేసిన హెచ్చరికల ప్రకారం ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటిని కూడా పరిగణనలోకి తీసుకుని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని పతంజలి రాందేవ్ బాబాను యోగా అండ్ నేచురోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు, అధికారులు నేరుగా కలుసుకుని ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు.


# మత్స్యకారులతో నా బంధం విడదీయరానిది..వారి అభిమానం వెలకట్టలేనిది: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

- కబడ్డీ పోటీలు విజేతలకు మేమెంటో అందజేసిన ఎమ్మెల్యే




**కావలి,కలంకౌంటర్ :** కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ పరిధిలోనిరామచంద్రపురంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాలు మరియు పోలేరమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రుని ఆశీస్సులు మత్స్యకార కుటుంబాలతో పాటు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలనిఆకాంక్షించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు జాతర కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు, మత్స్యకార సంఘాల నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు. పూలమాలలు,శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.జాతర ప్రాంగణంలో ఎమ్మెల్యే రాకతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.అనంతరం కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన వారికి మెమెంటో అందజేసిన ఎమ్మెల్యే..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "మత్స్యకారులు నాపై చూపిస్తున్న ప్రేమ, అభిమానం వెలకట్టలేనిది.మత్స్యకారులు ఏ కార్యక్రమానికి ఆహ్వానించినా తప్పకుండా హాజరవుతాను.నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం నా బాధ్యత. నిజాయితీకి, నమ్మకానికి నిలువెత్తు ప్రతిరూపం మత్స్యకార సమాజం"అని అన్నారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారసేవకార్యక్రమానికి తుమ్మలపెంటకి హాజరైన సందర్భంగా మత్స్యకారులు చూపించిన ఆత్మీయత, ప్రేమను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని,గత రెండు సంవత్సరాల కాలంలో తీర ప్రాంత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగాయని తెలిపారు. "రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, సహకారంతో మత్స్యకార గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తాం. తీర ప్రాంతంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతాం. మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం" అని ఎమ్మెల్యేస్పష్టంచేశారు. మత్స్యకారులతో తనకు ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ,"మత్స్యకారులతో నాకున్న బంధం విడదీయరానిది. వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటాను. మత్స్యకార కుటుంబాల అభ్యున్నతికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి నా పూర్తి సహకారం అందిస్తాను" అని హామీ ఇచ్చారు.జువ్వలదిన్నె హార్బర్ ప్రాజెక్టును ప్రస్తావిస్తూ, "జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణం జరగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ హార్బర్ ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.అనంతరం జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై స్థానిక ప్రజలతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, మత్స్యకార సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతర వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగాయి..

# గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి...



**కావలి,కలంకౌంటర్ :** గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు,వారి సంప్రదాయ వృత్తులకు అవసరమైన పరికరాలు, ఉపాధి అవకాశాలను పెంచే వాహనాలు అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య కోరారు. సోమవారం కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామానికి చెందిన గిరిజనులతో కలిసి ఆయన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ ఉపాధి, జీవనోపాధికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు అందితే తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వివరించారు.గిరిజనులకు ప్రత్యేకంగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంతో పాటు వారి వృత్తులకు అవసరమైన పరికరాలు, వాహనాలు అందించాలనికోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గిరిజనుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# విదేశీ విద్య పునరుద్ధరించాలి

-కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కు రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు విదేశీవిద్య ను పునరుద్ధరించాలని, సిగరెట్ విక్రేతల దోపిడీని ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బి.సి సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బీ.సీ నాయకులు సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థుల కోసం విదేశీ విద్యను అందుబాటులోకి తెచ్చి వారి కలలను సాకారం చేశారని కొనియాడారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు విదేశీవిద్య అమలు దిశగా చర్యలు తీసుకోలేదని సుబ్రమణ్యం అన్నారు. కాబట్టి వెంటనే అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జె. సి. కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. సిగరెట్ విక్రేతలు డిస్ట్రిబ్యూటర్ నుంచి హోల్ సేల్ , రిటైలర్ వరకు ధూమపాన ప్రియులను అడ్డంగా దోచుకుంటున్నారన్నారు.సిగరెట్ రకాన్ని బట్టి ఒక్కో రకానికి సుమారు రెండు నుంచి ఐదు రూపాయల వరకు ఎక్కువ వసూలు చేస్తున్నారన్నారు. ఇలా సుమారు 18% నుంచి 30% పెక్కు ధరలు దోచుకుంటున్నారని, దీనివలన ఎం. ఆర్. పి ధరలు అందుబాటులో లేకుండా పోయాయని ఆరోపించారు. దీనివలన ధూమపాన ప్రియులు తీవ్రంగా నష్టపోతున్నారని జె.సి కి సుబ్రమణ్యం వివరించారు. తక్షణమే విక్రేతలపై తనిఖీలు నిర్వహించి వారి దోపిడీని అడ్డుకొని ఎం. ఆర్. పి ధరలకు సిగరెట్లను విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని జె.సి కి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కోమటి శ్రీను,నాగరాజు,గౌర శ్రీను,రాధాకృష్ణ,. ప్రసాద్, కోటేశ్వర, . రామరాజు, సాంబశివ, కృష్ణ, . దుర్గ ప్రసాద్, . కాసులు, . రమేష్ తదితర బి.సి నాయకులు పాల్గొన్నారు.

# జెన్ జీ తరాన్ని గందరగోళపరచే శక్తులున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడు మోదీ . ఆయన నాయకత్వానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు పలుకుతుంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన నాయకుల్లో అత్యంత ఎక్కువ రోజులు దేశ ప్రధానిగా పనిచేసిన మోదీ కి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.

**సైనికులకు ప్రాంతీయత చూస్తామా..?..** దేశంతో మనం ఇంత భద్రంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో కాపాలా కాసే సైనికుల పుణ్యమే. సియాచిన్ వంటి గడ్డకట్టే చలిలో సైతం వారు దేశానికి చేసే సేవ అపూర్వం. వారెప్పుడూ మా ప్రాంతం అనే భావన చూపించరు. నా దేశం అనుకుంటారు. కానీ వారు నివసించే ప్రాంతంలో మాత్రం సైనికుల కుటుంబాలపై ప్రాంతీయ తత్వం ప్రభావంపడుతోంది . ఇదెలా కరెక్ట్. నేను ప్రతిసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మొదట మన ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. దేశం కోసం కష్టపడుతున్న వారిని ప్రాంతాలకు ముడిపెట్టడం సబబు కాదు. జాతీయ పార్టీ అంటే కేవలం ఎన్ని రాష్ట్రాల్లో, ఎన్ని ఓట్లు వచ్చాయని గుర్తించడం కాదు. జాతీయ పార్టీ అంటే దేశాన్ని కలిపేందుకు ఎంతలా పాటుపడుతోంది..? దేశ సమగ్రత కోసం ఎంత కష్టపడుతోందనేది చూడాలి. రాజ్యాంగ విలువల్ని పూర్తిగా పాటిస్తూ, దేశం కోసం పనిచేసే పార్టీనే జాతీయ పార్టీ అనుకోవాలి.

**రాష్ట్రానికి ఒక సిద్ధాంతం.. దేశానికి ఒక సిద్ధాంతం తప్పు..** భారత్ జోడో యాత్ర ద్వారా దేశమంతటా తిరిగి అందరినీ కలిసిన పార్టీ– నేను తెలంగాణలో తిరుగుతాను అంటే మాత్రం అనుమతి ఇవ్వదు. 1200 మంది తెలంగాణ కోసం బలిదానాలు చేసిన యువతకు నివాళి అర్పించేందుకు పర్మిషన్ ఇవ్వరు. కాంగ్రెస్ పార్టీ – దేశానికి ఒక సిద్ధాంతం.. పాలిస్తున్న రాష్ట్రాలకు మరో సిద్ధాంతం అనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీ రాజకీయాలు అపేయాలి. నాకు తెలంగాణ యువత పోరాటాల మీద గౌరవం ఉంది. నేను ఆంధ్రాలో పుట్టినప్పటికీ, నేల గురించి ఎన్ని త్యాగాలు చేయడానికి అయినా సిద్ధపడే తెలంగాణ యువత ఆకాంక్షల మీద గౌరవం ఉంది. తెలంగాణలో కొందరు నాయకులు యువతను బలి చేసి గద్దెలనెక్కారు. నాకు తెలంగాణలో ఎలాంటి పదవులు వద్దు. కానీ తెలంగాణ యువత కోసం, వారి ఆశలు, ఆశయాల కోసం మనస్ఫూర్తిగా జనసేన పార్టీ పనిచేస్తుంది. జనసేన సిద్ధాంతపరంగా బలమైన భావజాలం ఉన్న పార్టీ. ఒక సిద్ధాంతాన్ని నమ్మితే దానికోసం సర్వం కోల్పోవడానికి సిద్ధమయ్యే మనస్తత్వం నాది. పోరాటం.. పోట్లాట పార్టీకి ఊపిరి.

**గందరగోళపరుస్తారు జాగ్రత్త..** సామాజికంగా వచ్చే మార్పులను అనుసరించి రాజకీయంగా వ్యూహాలు మార్చుకోవడం కచ్చితంగా ఉంటుంది. జెన్ జీ తరం వాళ్ళు దేశం కోసం ఆలోచించే బలమైన మనస్తత్వం ఉన్నవారు. యువతే దేశానికి పునాది. వారే భవిష్యత్తుకు మార్గనిర్దేశకులు. అయితే సామాజిక మాధ్యమాల్లో కొందరు గందరగోళపరిచే చర్యలను జెన్ జీ తరం జాగ్రత్తగా గమనించాలి.

# బాపట్ల - అప్పికట్ల రైల్వే స్టేషన్ ల మధ్య రైల్లో చోరీ జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

- 10 ప్రత్యేక పోలీస్ బృందాలతో నిందితుల కోసం గాలింపు




**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల – అప్పికట్ల రైల్వే స్టేషన్ ల మధ్య సర్కార్ ఎక్స్ప్రెస్ లోని ఎస్3, ఎస్6 భోగిలలో అపరిచిత వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన విదితమే, చోరీ జరిగిన ఘటన స్థలాన్ని సోమవారం ఉదయం జిల్లా ఎస్పి బి.ఉమామహేశ్వర్ పరిశీలించారు. ట్రైన్ ఆగిన ప్రదేశాన్ని, దుండగులు తప్పించుకొని పొలాల గుండా పారిపోయిన మార్గాన్ని ఎస్పీ పరిశీలించారు. భౌతిక సాక్షాధారాలు సేకరిస్తున్న నిపుణుల బృందానికి పలు సూచనలు చేశారు. పరిసర గ్రామాలు, నిర్మానుష్య ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, అనుమానితులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా విచారించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి 1.10 గంటల సమయంలో చెన్నై నుండి విజయవాడ వైపు వెళ్తున్న సర్కార్ ఎక్స్ప్రెస్ లో కొంతమంది గుర్తు తెలియని దుండగులు అప్పికట్ల రైల్వే స్టేషన్ సమీపంలోని కెవి పాలెం ప్రాంతం దగ్గరలో చైన్ లాగి.. ట్రైన్ ను ఆపి దోపిడీకి పాల్పడే ప్రయత్నం చేశారన్నారు. ట్రైన్ ఆగగానే ట్రైన్ లో విధులలో ఉన్న ఎస్కార్ట్ సిబ్బంది, రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తంగా వ్యవహరించి అప్పికట్ల స్టేషన్ మాస్టర్ కు సమాచారం అందించడం జరిగిందన్నారు. స్టేషన్ మాస్టర్ నుండి వచ్చిన సమాచారం మేరకు వెంటనే ట్రైన్ ఆగి ఉన్న ప్రాంతానికి ఏఆర్ సిబ్బంది చేరుకున్నారన్నారు. ఆ సమయంలో దోపిడీకి పాల్పడుతున్న దుండగులపై 9 రౌండ్ల కాల్పులు జరపడం జరిగిందన్నారు. పోలీస్ ఫైర్ తో దుండగులు ప్రాణభయంతో అక్కడ నుండి పారిపోయారన్నారు. వెంటనే పోలీస్ సిబ్బంది, రైల్వే సిబ్బంది, సమీప గ్రామాల్లోనూ విస్తృత తనిఖీ చేశారన్నారు. సుమారు 7 కంటే ఎక్కువ మంది ఈ దోపిడీ ప్రయత్నంలో పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. వీరి ఆచూకీ కోసం మొత్తం 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీరు సమీప గ్రామాలలో, రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాలతో పాటు అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక అనుమానితుడిని కూడా బాపట్ల టౌన్ పరిసరాల్లో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్నారు. నిందితుల ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నామన్నారు.

# విద్యాశాఖ కమిషనర్ ను కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీలు



**విజయవాడ,కలంకౌంటర్ :** ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీం అన్సారియా ను పట్టభద్రుల ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్ , భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కలిసి పలు సమస్యలు చర్చించారు. ఎం టి ఎస్ ఉపాధ్యాయుల బదిలీలు, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్, ట్రాన్స్ఫర్డ్ బట్ నాట్ రిలీవ్డ్ టీచర్స్ సర్దుబాటుకు ముందే వీరిని రిలీవ్ చేసి సర్దుబాటు చేయాలని కోరారు. వీటికి ఆమె సానుకూలంగా స్పందించారు అదేవిధంగా ఎంఈఓ 1, ఎంఈఓ 2 పేర్లు మార్చాలని సూచించారు.ప్రభుత్వానికి ఈ విషయాన్ని పంపుతామని కమిషన్ తెలిపారు.ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి ఆమెను కోరారు. దానికి ఆమె సమాధానమిస్తూ జిల్లాల బైపర్ కేషన్ తర్వాత ప్రమోషన్స్ ఉంటాయని తెలిపారు.ఓ హెచ్ లు గతంలో వలే పాఠశాల మొత్తానికి ఇవ్వాలని కోరారు. పాత విధానాన్ని అమలు చేస్తామని కమిషనర్ ఎమ్మెల్సీలకు హామీ ఇచ్చారు. ఇదేవిధంగా పలు విషయాలపై, ఉపాధ్యాయుల సమస్యలపై వారు ఆమెతో చర్చించినట్లు ఎమ్మెల్సీలు తెలిపారు.

# అ"పూర్వ"కలయిక

**•ఆత్మీయ సమ్మేళనం •సంక్షేమ నిధికి కోనా లక్ష విరాళం**







**కైకరం (ప.గో. జిల్లా),కలంకౌంటర్ :** ప. గో. జిల్లా కైకరం గ్రామంలో 1986బి87 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదంగా జరిగింది.ఆదివారం నాగ సూర్య కన్వెన్షన్ హాల్ నందు ఆత్మీయ పలకరింపులు,ఆనందకరమైన వాతావరణం లో నిర్వహించారు. 40 సంవత్సరాలు తర్వాత తొలిసారి కలుసుకోవడంతో ఒకరిపై ఒకరు అభిమానం చాటుతూ గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

**లక్ష విరాళం....** 1986బి87 బ్యాచ్ సంక్షేమ నిధికి సేవా రత్న, ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు.అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఈ నిధి వినియోగించే నిమిత్తం ఇస్తున్నట్లు కోనా తెలిపారు.గురువులకు ఘన సన్మానం చేశారు.కుటుంబ స్థితి గతులు,యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందిన ఉన్న కోనా శ్రీనివాసరావు ను పలువురు అభినందించి సన్మానించారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com